సాక్షి
వికారాబాద్
బుధవారం ı 20 ı డిసెంబర్ ı 2023



పల్లెపోరు ఎప్పుడో?
గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదు. దీంతో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. 8లో▸



26నుంచి జాతర
కొడంగల్ సరిహద్దు.. కర్ణాటకలోని మోత్కుపల్లి క్షేత్రంలో జాతరకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. 8లో▸



మమ అనిపించారు
ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే దోమ మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. 9లో▸

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన లాల్‌కృష్ణ



రేవంత్‌రెడ్డికి బొకే అందజేస్తున్న లాల్‌కృష్ణ

పరిగి: సీఎం రేవంత్‌రెడ్డిని డీసీసీ ఉపాధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ మంగళవారం ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేసిన వారిని పార్టీ గుర్తిస్తుందని సీఎం చెప్పినట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రాజపుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

అనంతగిరి: గంజాయి, మత్తు పదార్థాల విక్రయంపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌ను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల రవాణా, వ్యాపారం, సేవించే వ్యక్తుల సమాచారం ఉంటే టాస్క్‌ఫోర్స్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి విక్రయంపై సెల్ నంబర్ 87125 83483కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాన్ని ప్రజలకు, విద్యార్థులకు, యువతకు అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి జిల్లా అధికారి రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను కళాశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెన్యూవల్, ఫ్రెష్ ఉపకార వేతనాల కోసం ఈపాస్ వెబ్‌సైట్ నందు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న తర్వాత హార్డ్‌కాపీలు రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో సమర్పించాలని కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

ఆమనగల్లు: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మహేందర్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ప్రభుత్వం చేపట్టే జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆమోదించిన మహిళా బిల్లులో బీసీ సబ్‌కోట బిల్లును తీసుకురావాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేకంగా మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీల హక్కుల సాధనకై పోరాడుతామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయండి

ఉపాధి హామీ పథకం పీడీ ప్రభాకర్



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ ప్రభాకర్, అధికారులు

శంకర్‌పల్లి: రూర్బన్ నిధులతో చేపడుతున్న పనులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా ఉపాధిహామీ పీడీ ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని మోకిలలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డ్ పనులను, నర్సరీని మంగళవారం ఆయన పరిశీలించారు. పనులు ఏ దశలో ఉన్నాయో ఎంపీడీఓ వెంకయ్యాగౌడ్‌ను అడిగితెలుసుకున్నారు. నర్సరీల బాధ్యత కార్యదర్శులదేనని అన్నారు. మోకిల సర్పంచ్ సుమిత్ర, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

‘లైన్’లో పడేనా?



కృష్ణా - వికారాబాద్ రైల్వే లైన్‌పై సీఎం నజర్
- కొడంగల్ మీదుగా రైళ్లు
- మెరుగు పడనున్న ప్రజారవాణా

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గ ప్రజలను 40 ఏళ్లుగా ఊరిస్తూ వస్తున్న కృష్ణా - వికారాబాద్ రైల్వే లైన్‌పై ముఖ్యమంత్రి రేవంత్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గానికి రైల్వే లైన్ తేవాలన్నది రేవంత్ ఆశయం. ఈ విషయాన్ని ఆయన పలుమార్లు బహిరంగంగా ప్రకటించారు. అయితే గత పాలకులు రైల్వే లైన్ ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టారు. నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారు. కొడంగల్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నారు. కొడంగల్ అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. అందులో ఒకటి రైల్వే లైన్. రెండోది 69 జీఓను అమలు చేయడం. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఊపిరి పోయడం. కోస్గి పట్టణానికి ఇంజనీరింగ్ కళాశాల, కొడంగల్, కోస్గిలో వంద పడకల ఆస్పత్రుల నిర్మాణం, కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడం, కొడంగల్ పట్టణ అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసి కలెక్టర్ స్థాయి అధికారిని నియమించే అవకాశం ఉంది. త్వరలో కొడంగల్ అభివృద్ధిపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న రైల్వే లైన్‌కు త్వరలో మోక్షం లభించే అవకాశం ఉంది. దీంతో ప్రజలకు రవాణా మెరుగుపడుతుంది. రైల్వే శాఖకు ఆదాయం వస్తుంది.

40 ఏళ్ల క్రితమే సర్వే..

కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేయించాలనే ఉద్దేశంతో 1980 - 81 సంవత్సరంలో అప్పటి మహబూబ్‌నగర్ ఎంపీ, రైల్వేశాఖ సహాయ మంత్రి మల్లికార్జున్ సర్వేకు ఆదేశించారు. వికారాబాద్ నుంచి పరిగి, దోమ, సర్జఖాన్‌పేట, మద్దూరు, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్ మీదుగా కృష్ణ వరకు రైల్వే లైన్ నిర్మాణానికి సర్వే చేయించారు. అయితే కొడంగల్ ప్రజల డిమాండ్ మేరకు రెండో పర్యాయం సర్వేకు కేంద్రం ఆదేశించింది. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మీదుగా రైల్వే లైన్ వేస్తే ఆదాయం వస్తుందని గణాంకాలతో ఇక్కడి విద్యావంతులు అధికారులు కేంద్రానికి నివేదిక పంపించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి ఆదేశాల మేరకు రెండో సారి సర్వే జరిగింది. కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేస్తే బాగుంటుందని నిపుణులు నివేదిక సమర్పించారు. అనంతరం జరిగిన పరిణామాలతో రాష్ట్ర విభజన జరిగింది. ఆ తర్వాత జిల్లాల విభజన జరిగింది. కోస్గి, మద్దూరు మండలాలు మహబూబ్‌నగర్ జిల్లాలోకి వెళ్లాయి. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలు వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కొడంగల్ మీదుగా రైల్వే లైన్ వేస్తే జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించడానికి వీలుగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

దూర ప్రాంతాలకు రాకపోకలు

వికారాబాద్ జిల్లా నుంచి పరిగి, బొంరాస్‌పేట, కొడంగల్, కోస్గి, మద్దూరు, నారాయణపేట, ఊట్కూర్, మక్తల్, మాగనూర్ మీదుగా కృష్ణ వరకు రైల్వే లైన్ నిర్మిస్తే కొడంగల్ నియోజకవర్గానికి న్యాయం జరుగుతుంది.దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి సులువుగా ఉంటుంది. అంతేకాకుండా వివిధ రకాల సరుకుల రవాణా ద్వారా రైల్వే శాఖకు ఆదాయం వస్తుంది.

అభివృద్ధికి అవకాశం



వికారాబాద్ - కృష్ణ రైల్వే లైన్ ఏర్పాటుతో కొడంగల్ నియోజకవర్గానికి మేలు జరుగుతుంది. రవాణా వ్యవస్థ మెరుగు పడుతుంది. ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంది. గతంలో రెండు సార్లు సర్వే చేశారు. ఇన్నాళ్లు పెండింగ్‌లో పెట్టారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి అన్ని విధాలుగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాం.

– మహ్మద్ యూసూఫ్, కొడంగల్



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు

సమన్వయంతో పనిచేయండి

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- కలెక్టర్, అధికారులతో సమీక్ష



హాజరైన అధికారులు

అనంతగిరి: జిల్లా అభివృద్ధికి అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలని వికారాబాద్ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం శాసనసభ మందిరంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లాస్థాయి అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చిన్నాభిన్నంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. రైతుల ఆర్థిక ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని రక్షణ కల్పించాలని ఆదేశించారు. ఆర్‌డీఓలు ఇందుకు సంబంధించిన నివేదికలు సమర్పించాలన్నారు. పదేళ్లుగా రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన నివేదికలను సమర్పించాలన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతిగ్రామానికి అందేలా చూడాలన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు మంచి సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో జిల్లాను అభివృద్ధి దిశగా తీసుకెళతామని పేర్కొన్నారు. అంతకుముందు స్పీకర్, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలను కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు సత్కరించారు.



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న అర్చక సంఘం నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

మంత్రి కొండా సురేఖకు అర్చకుల సంఘం వినతి

కొడంగల్ రూరల్: ఆలయాల్లో ధూప, దీప, నైవేద్య అర్చకుల సమస్యలను పరిష్కరించాలని డీడీఎన్ఎస్ సంఘం నేతలు మంత్రి కొండా సురేఖను కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని ఆమె కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో అర్చకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ధూప దీప నైవేద్య అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అర్చక వెల్ఫేర్ ఫండ్‌ను వర్తింపజేయాలన్నారు. అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. ప్రభుత్వ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. పెద్ద ఆలయాల్లో ఉచిత దర్శనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ వేతనాల తోపాటు ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో డీడీఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి, ప్రసాద్‌శర్మ, హరికిషన్ శర్మ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఔటర్‌పై ఆరా!

- లీజు విషయంలో విధి విధానాలేమిటి?
- ప్రణాళికా విభాగంలో అనుమతులెలా ఇస్తారు?
- జీఓ 111 పరిధిలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయా?
- పలు విభాగాలపై హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్ సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్ బాధ్యతలు చేపట్టిన రెండో రోజే వివిధ విభాగాలపై సమీక్షించారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అత్యంత కీలకమైన హెచ్‌ఎండీఏ ప్రణాళిక, ఇంజనీరింగ్ విభాగాలపై ఆయన దృష్టి సారించారు. కమిషనర్‌గా తొలిసారి అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయానికి వచ్చిన ఆయన ఆయా విభాగాలు చేపట్టే పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవన నిర్మాణాలు, లే అవుట్ అనుమతులు తదితర అంశాలపై ఆయన అధికారులతో మాట్లాడారు. మరోవైపు ఔటర్‌రింగ్ రోడ్డు లీజుతో సహా కీలకమైన అంశాలపైన సమీక్షించినట్లు తెలిసింది. జీఓ 111 పరిధిలోని శంషాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం. హెచ్‌ఎండీఏకు వచ్చిన మొదటి రోజే విధులను నిర్వహించడంతో పాటు పలు అంశాలపై సమాచారం కోసం అధికారులను హడలెత్తించారు.

వివాదాస్పదంగా మారడంతో..

- ఇంజనీరింగ్ విభాగంపై సమీక్షించే క్రమంలో ఔటర్ లీజుపై ఆరా తీసినట్లు తెలిసింది. ఔటర్‌రింగ్‌రోడ్డును లీజుకు ఇచ్చేందుకు అనుసరించిన పద్ధతులు, విధివిధానాలు తదితర అంశాలపై అధికారులతో దానకిషోర్ మాట్లాడారు. హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును గత ప్రభుత్వం 30 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రతి సంవత్సరం వాహనాల నుంచి టోల్‌ట్యాక్స్ రూపంలో రూ.వందల కోట్ల ఆదాయాన్నిచ్చే ఔటర్ రింగ్ రోడ్డును 30 ఏళ్లపాటు కేవలం రూ.7380 కోట్లకు లీజుకు ఇవ్వడం పట్ల ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ప్రతిపక్షనేతగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.
- ఔటర్‌లీజు వ్యవహారంలో అతిపెద్ద కుంభకోణం ఉందని ఆరోపించారు. మరోవైపు బీజేపీ సైతం ఈ లీజును తీవ్రంగా ఖండించింది. రద్దు చేయాలని డిమాండ్ చేసింది. దీంతో ఔటర్‌లీజు అంశం వివాదాస్పదంగా మారింది.
- టీఓటీ పద్ధతిలో ఔటర్ లీజును దక్కించుకున్న ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ గడువులోపే లీజు మొత్తాన్ని చెల్లించి ఔటర్‌ను దక్కించుకుంది. గతంలో ఔటర్‌పై విధులు నిర్వర్తించిన కొందరు ఇంజనీరింగ్ నిపుణులు సైతం అప్పట్లో ఈ లీజు పట్ల పెదవి విరిచారు. కనీసం రూ.8 వేల కోట్ల ఆదాయమైనా వస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. లీజు ఒప్పందంతో ప్రభుత్వానికి కనీసం రూ.1000 కోట్ల వరకు నష్టం వచ్చిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వివాదాస్పదంగా మారిన ఔటర్‌లీజుపై ప్రస్తుత ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా దానకిషోర్ బాధ్యతలు చేపట్టిన రెండో రోజే ఇంజనీరింగ్ అధికారులతో చర్చించడం గమనార్హం.
- లీజు విధివిధానాలు, బిడ్డింగ్ జరిగిన తీరు, బేస్ ప్రైస్ వంటి పలు అంశాలపై ఆయన అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం ఐఆర్‌బీ సంస్థ నిర్వహణలోనే ఔటర్ ఉన్నప్పటికీ గ్రీనరీ నిర్వహణ మాత్రం హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉంది. మరోవైపు ఔటర్‌కు రెండు వైపులా పెద్ద ఎత్తున బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం కొనసాగుతోంది. హైరైజ్ భవనాల అనుమతులపై కూడా కమిషనర్ దృష్టి సారించారు. మరోవైపు పలు అభివృద్ధి ప్రాజెక్టులపైనా అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుతం కొనసాగుతున్న మూసీపై అత్యాధునిక వంతెనల నిర్మాణం, పలుచోట్ల చేపట్టిన పార్కుల అభివృద్ధి, వినియోగంలోకి వచ్చిన సైకిల్‌ట్రాక్, ఉప్పల్ స్కైవాక్ తదితర ప్రాజెక్టులను వివరించారు.


అనుమతులపై సమీక్ష..

హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగంపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. జీఓ 111 పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా కొనసాగుతున్న నిర్మాణాలపై ఆయన ఆరా తీసినట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా భూ వినియోగ మార్పిడి సర్టిఫికెట్‌లను పొందిన కొందరు శంషాబాద్, వట్టినాగులపల్లి, తదితర ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్న అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. వివిధ రకాల భవనాలకు అనుమతులను ఇచ్చేందుకు ఎలాంటి నిబంధనలు ఉంటాయనే అంశంపై చర్చించారు. కమిషనర్ స్థాయిలో ఆమోదించాల్సినవి, డైరెక్టర్ల స్థాయిలో ఆమోదించాల్సిన భవనాలపై వివరాలను అడిగారు. కార్యక్రమంలో ప్రణాళికా విభాగం డైరెక్టర్లు, ప్లానింగ్ అధికారులు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విభాగంపై జరిగిన సమీక్షలో చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్‌రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

‘కమలం’ కసరత్తు..

- పార్లమెంట్ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించిన బీజేపీ అధిష్టానం
- పరిశీలనలో మాజీ ఎంపీ కొండా, భాస్కరయోగి పేర్లు
- అసెంబ్లీ ఎన్నికల్లో అంటీముట్టనట్లుగా వ్యవహరించారని కొండాపై విమర్శలు
- భాస్కరయోగికి పార్టీ ముఖ్యులతో సత్సంబంధాలు

వికారాబాద్: కమలం పార్టీ పార్లమెంట్ ఎన్నికల కసరత్తును ప్రారంభించింది. అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు ఊపుమీదున్న ఆ పార్టీ ఆ తరువాత చితికిల పడిపోవడంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పార్టీ నాయకత్వం ఆ పొరపాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో పునరావృతం కాకూడదనే దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లో పార్టీ కోర్ సభ్యులకు, యువతకు అవకాశం ఇవ్వడం ద్వారా సక్సెస్ అయిన ఆ పార్టీ తెలంగాణలోనూ ఆ వ్యూహాన్ని అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికలు సమీపించే సమయానికి పార్టీని బలోపేతం చేయడం తోపాటు ముందుగానే అభ్యర్థుల ప్రకటన చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. బహుముఖ వ్యూహంలో భాగంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాలు చేపట్టడం తోపాటు దానికి సమాంతరంగా ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై కూడా అధిష్టానం దృష్టి సారించినట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే జిల్లా నేతలు, క్యాడర్‌లో సమన్వయం లేకపోవడం పెద్ద సమస్యగా తయారైంది. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి లాంటి సీనియర్ నేత ఉండి కూడా జిల్లాలో కేడర్‌ను సమన్వయం చేసే విషయంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



భాస్కరయోగి



కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పరిశీలనలో ఇద్దరి పేర్లు

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చేవెళ్ల స్థానం నుంచి కమలం పార్టీ తరఫున ఎవర్ని రంగంలోకి దింపుతారనే విషయంలో చర్చ మొదలైంది. అయితే చేవెళ్ల అభ్యర్థిగా పోటీ చేసే వారి జాబితాను సైతం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అధిష్టానం ప్రతిపాదించిన జాబితాలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరుతో పాటు రచయిత, వక్త అయిన లెక్చరర్ భాస్కరయోగి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఎక్కువ శాతం ఇక్కడి నుంచి ఆయా పార్టీల తరఫున స్థానికేతరులే పోటీ చేయగా.. కమలం పార్టీ మాత్రం స్థానికులను రంగంలోకి దింపాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. మంచి పేరు.. ఈ ప్రాంతంపై పట్టున్న భాస్కరయోగిని చేవెళ్ల నుంచి రంగంలోకి దింపాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనకు స్థానికంగా బీజేపీ నేతలతో పాటు ఆర్ఎస్ఎస్‌తోనూ మంచి సంబంధాలు ఉన్నాయి. రాష్ట్రంలో బండి సంజయ్, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ లాంటి ముఖ్య నేతలందరితో సత్సంబంధాలు ఉన్నాయి. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ లాంటి వ్యక్తి ఇంటికి వచ్చేంతగా ఆయనకు పార్టీలో గుర్తింపు ఉంది. ఇటీవల బండి సంజయ్ ఇంటికి వచ్చి వెళ్లడం కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటి వరకు చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా వికారాబాద్ జిల్లా నుంచి ఎవరికి అవకాశం రాలేదు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ బరిలో పరిగికి చెందిన భాస్కరయోగిని దింపే యోచనలో అధిష్టానం ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

ప్రతిపాదనలో కొండా పేరు

చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయించే జాబితాలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరు సైతం ప్రముఖంగా వినిపిస్తోంది. ఇతను గతంలో బీఆర్ఎస్ తరఫున చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అనంతరం బీజేపీలో చేరిన ఆయన ఈ సారి కమలం పార్టీ తరఫున బరిలో నిలవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఆ పార్టీ నేతల మధ్య సమన్వయ లోపం.. పార్టీ అభ్యర్థుల గెలుపునకు విఘాతం కలిగిస్తూ వస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీలో ముఖ్య నేతగా ఉన్న విశ్వేశ్వర్‌రెడ్డి నాయకులను సమన్వయం చేయ డంలో విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన వికారాబాద్ జిల్లాలో బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొనకపోవడం కూడా జిల్లా నేతలు సంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. అయితే ఉమ్మడి జిల్లా మొత్తం ఆయన సుపరిచితుడు కావటం ఆయనకు కలిసొచ్చే అంశం కానుంది.

పల్లె పోరు ఎప్పుడో?


గ్రామ పంచాయతీ భవనం

- గ్యారంటీల అమలు తర్వాతే ప్రభుత్వ నిర్ణయం
- ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు యత్నం
- లోక్‌సభ ఎన్నికల తర్వాతే అంటూ ప్రచారం

మోమిన్‌పేట: గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించే పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదు. ఇటీవలే తెలంగాణలో కొత్త సర్కారు కొలువుదీరడంతో స్థానిక పోరుకు కొంత సమయం తీసుకోనున్నట్లు సమాచారం. సాధారణ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను, వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుతం వాటి అమలుపైనే కాంగ్రెస్ దృష్టి సారించింది. వాటిలో రెండు పథకాలు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. మిగతావి పూర్తయ్యాక పంచాయతీ ఎన్నికలకు వెళ్తే పార్టీకి మేలు జరుగుతుందనే ఆలోచనల్లో ప్రభుత్వం ఉంది. మరోవైపు పార్లమెంటు ఎన్నికలు పూర్తయ్యాక నిర్వహిస్తే బాగుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను కొనసాగిస్తున్నా.. సర్కారు మాత్రం అందుకు సిద్ధంగా లేనట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ పంచాయతీ రాజ్ నూతన చట్టాన్ని ఏర్పాటు చేసి, రెండు సార్లు ఒకే రిజర్వేషన్ ఉంటుందని పేర్కొనడంతో ప్రస్తుతం రిజర్వేషన్‌లపై సర్వత్రా చర్చనీయాంశం అయింది.

రిజర్వేషన్లు కొనసాగుతాయా?

జనవరి31తో సర్పంచుల పదవీకాలం ముగియనుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అవే రిజర్వేషన్లను కొనసాగించనుందా? లేక రొటేషన్ పద్ధతి తీసుకువస్తుందా అనేం సందేహం నెలకొంది. ఇప్పటి వరకు ప్రభుత్వం జీపీ ఎన్నికల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. సుప్రీ కోర్టు తీర్పును అనుసరించి గత ప్రభుత్వం రిజర్వేషన్లు 50శాతానికి మించకుండా.. నూతన పంచాయతీరాజ్ చట్టంలో మార్పు తెచ్చింది. దీంతో బీసీ రిజర్వేషన్ కోటా 34శాతం నుంచి 23.81శాతానికి తగ్గించింది. ఎస్టీలకు 5.73, ఎస్సీలకు 20.46శాతం యథావిధంగా ఉంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం పెంచుతామని పేర్కొన్న దరిమిలా కొంత స్పష్టత రావాల్సి ఉందని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

బీసీ గణనపై ఈసీ దృష్టి

కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు వారాలు గడుస్తున్నా.. స్థానికతపై ఎలాంటి ఆదేశాలు చేయడం లేదు. రిజర్వేషన్లు మారితే ఎలా ఉంటాయన్న చర్చ జరుగుతోంది. ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషన్ బీసీ ఓటర్ల గణన, జాబితా తయారు చేయడంపై దృష్టి సారించింది. అందుకు సంబంధించిన పనులు పూర్తి చేసి సిద్ధంగా ఉంచు కోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

పల్లెల్లో సందడి

స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. నిన్నటి వరకు శాసన సభ ఎన్నికల్లో ఎవరికి వారే యమునాతీరే అన్నట్లు ఉన్న నాయకులు.. పలకరింపులు మొదలు పెట్టారు. ఊపు మీదున్న కాంగ్రెస్ నాయకులు.. అదే ఒరవడిని కొనసాగించేలానే ఉత్సాహంలో ఉన్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడక పోవటంతో ఆశావహులు డీలా పడుతున్నారు.

రాత్రికిరాత్రే నీటిని విడుదల చేస్తారా?

ఇరిగేషన్ అధికారుల తీరుపై రైతుల మండిపాటు

ధారూరు: 'కోట్‌పల్లి ప్రాజెక్టు కాల్వలకు నీటిని విడుదల చేసే సమయంలో ధారూరు, పెద్దేముల్ మండలాల రైతులకు, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి. ప్రాజెక్టు వద్ద అన్ని ఏర్పాట్లు చేసి సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. ఇలాంటివేమీ చేయకుండా రాత్రికిరాత్రే ప్రాజెక్టు కాల్వలకు నీటిని విడుదల చేస్తారా' అంటూ ఆయకట్టు రైతులు ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎదుటే సోమవారం రాత్రి ప్రశ్నించారు. ఇది ఎమ్మెల్యేను తప్పుదోవ పట్టించినట్లు అవుతుందని మండిపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రాజెక్టు కుడి, ఎడమ, బెబికెనాల్ నుంచి ఆయకట్టు రైతుల పొలాలకు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి గ్రామాల్లో దండోరా వేయడంతో పాటు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఇవేమీ చేపట్టకుండా.. కెనాల్ తూము వద్ద ఒకమూర పూలదండ వేసి కార్యక్రమాన్ని మమ అనిపించడం మంచిది కాదని హితవు పలికారు. ఇలా చేయడం ఎంతవరకు సబబు అని నీటిపారుదల శాఖ అధికారులను నిలదీశారు.

'మాకు న్యాయం చేయండి'

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి ఉపాధ్యాయుల వినతి

ఇబ్రహీంపట్నం రూరల్: జీఓ 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు సత్వరమే న్యాయం చేయాలని స్థానిక సాధన సమితి తెలంగాణ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం గౌడ్‌ను సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. జీఓ ద్వారా నష్టపోయిన వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు సమితి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఆర్థిక కార్యదర్శి చక్రపాణి, అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లేశం, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సాధన సమితి నేతలు

క్లుప్తంగా

26 నుంచి మోత్కుపల్లి జాతర


మూలమూర్తి స్వామి

కొడంగల్: నియోజకవర్గ సరిహద్దు, కర్ణాటక రాష్ట్రం మోత్కుపల్లి క్షేత్రంలో వెలసిన బలభీమసేన స్వామివారి జాతరకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ నెల 22న శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పల్లకీ సేవ, ధ్వజారోహణం, 23న గీతా పారాయణం, 24న హరివాసర, పంచామృతాభిషేకం, పల్లకీ సేవ, రాత్రి 7 గంటలకు నెమలి వాహన సేవ, 25న మధ్యాహ్నం పల్లకీ సేవ, రాత్రి గజ వాహన సేవ నిర్వహించనున్నారు. ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం 26న రాత్రి వైభవంగా చేపట్టనున్నారు. 27న సాయంత్రం 4 గంటలకు పూల తేరు, గజోత్సవం, సాయంత్రం 7 గంటలకు పుష్కరిణిలో స్వామివారి స్నానం పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. 28 నుంచి 31 వరకు ప్రత్యేక పూజలు, జనవరి 1న పల్లకీ సేవ, ధ్వజారోహణంతో వేడుకలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

తాండూరు టౌన్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఇందిరాచౌక్ సమీపాన ఉన్న శ్రీసాయి వైన్స్ ఎదుట ఓ వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై వంకాయ రంగు షర్టు, లైట్ బ్లూ కలర్ ప్యాంటు, మెడలో టవల్ ఉందని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 8712570049, 8712570050 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు


పేకాటరాయుళ్లను చూపిస్తున్న పోలీసులు

కొడంగల్ రూరల్: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన మంగళవారం మండల పరిధి రుద్రారంలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారంలో పోలీసులు ఆకస్మిక దాడులు చేయగా.. పేకాట ఆడుతున్న ఆరుగురు యువకులను గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి 50వేల 60రూపాయలను స్వాధీనం చేసుకున్నామని, సీఐ రాములు ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. పేకాట, గంజాయిలాంటి మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని, వాటిని అమ్మినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చౌక ధరల దుకాణాల తనిఖీ

మహేశ్వరం: వ్యాపారం ఏదైనా వినియోగదారుడే కీలకమని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. మంగళవారం మండల పరిధి మహేశ్వరం, తుక్కుగూడలో చౌక ధర దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. సరకుల నిల్వలను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. దుకాణాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నిర్వహణలో అలసత్వం, ఉదాసీనత పనికిరాదని చెప్పారు.

తల్లీ పిల్లలు అదృశ్యం


తల్లితో పిల్లలు(ఫైల్)


మునీరున్నీసా (ఫైల్)

మంచాల: ఇంట్లో గొడవపడి తల్లీ పిల్లలు అదృశ్యమైన సంఘటన మంచాల మండలం లింగంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సతీష్ కుమార్ కథనం ప్రకారం.. లింగంపల్లికి చెందిన మైలారం మహేశ్వరి(30) కూలీ పనులు చేస్తుండేది. ఆమె భర్త గోపాల్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో మంగళవారం ఉదయం ఓ పాఠశాల బస్సులో ఇద్దరు పిల్లలతో కలిసి ఆమె లింగంపల్లి నుంచి ఇబ్రహీంపట్నం వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. ఎంత వెతికినా వారి జాడ తెలియరాలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. వారి ఆచూకీ తెలిసిన వారు 7396217607, 872662654 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పహాడీషరీఫ్‌లో వృద్ధురాలు..

పహాడీషరీఫ్: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉస్మాన్‌నగర్‌కు చెందిన మునీరున్నీసా బేగం(68)కు మానసిక పరిస్థితి సరిగ్గా లేదు. ఈ క్రమంలోనే ఈ నెల 18న ఇంట్లో చెప్పకుండా వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆమె కుమారుడు మహ్మద్ అస్లాం ఖాన్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జాడ తెలిసిన వారు 87126 62366 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

చోరీకి గురైన విగ్రహాల అందజేత


విగ్రహాలను చూపిస్తున్న ఇన్‌స్పెక్టర్ సతీష్. చిత్రంలో మామిడిపల్లి వాసులు

పహాడీషరీఫ్: చోరీకి గురైన విగ్రహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. వాటిని ఆలయ కమిటీకి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మామిడిపల్లి గ్రామం పోతరాజు దేవాలయ ఆవరణలోని లక్ష్మీదేవి, మైసమ్మ, దుర్గా భవానీ అమ్మవార్ల పంచలోహ విగ్రహాలు ఇటీవల చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుడు కాళిమాత రోహిత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. దుండగుడి నుంచి స్వాధీనం చేసుకున్న విగ్రహాలను మంగళవారం సాయంత్రం ఇన్‌స్పెక్టర్ సతీష్.. గ్రామానికి చెందిన లాల్ సతీష్ గౌడ్, కృష్ణ, శ్రీనివాస్, అనిల్, శ్రీధర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా నిందితుడు ఇప్పటి వరకు 15 దేవాలయాలల్లో చోరీలకు పాల్పడినట్లు తెలిసింది.

న్యాయ సేవలను వినియోగించుకోండి


రైతులకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి ఇందిర

శంషాబాద్ రూరల్: రైతులు న్యాయ సేవాధికార సంస్థ సేవలను వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి.ఇందిరా సూచించారు. మండలంలోని మల్కారం ఉన్న రైతు వేదికలో మంగళవారం రైతులు, సాగు చట్టాలు, న్యాయ సలహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఉచితంగా న్యాయ సహాయం అందుతుందన్నారు. చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసం కోర్టుకు వెళ్లకుండా ఇక్కడ రాజీమార్గంతో న్యాయం పొందవచ్చన్నారు. రైతులు బయటి వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే ముందు ప్రాంసరీ నోటుపై పూర్తి వివరాలు రాసి, చదివిన తర్వాతనే మధ్యవర్తుల సమక్షంలో సంతకాలు చేయాలన్నారు. ఎలాంటి దస్త్రాలు లేని భూపంపకాల వివాదాలను కూడా ఇక్కడ పరిష్కరించుకోవచ్చన్నారు. భూముల కొనుగోలు సమయంలో హద్దులను దస్తావేజుల్లో పొందుపర్చుకోవాలన్నారు. ఏడాదికి నాలుగు సార్లు మెగా లోక్ అదాలత్ ద్వారా క్రిమినల్, రోడ్డు ప్రమాదాలు, బ్యాంకు రుణాలు, విద్యుత్ చౌర్యం వంటి కేసులను కూడా రాజీతో పరిష్కరించుకోవచ్చన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: ప్రతిభా కళాశాల (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)లో 2024-25 విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కమ్మదనం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రూ.200 పరీక్ష రుసుము చెల్లించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరేందుకు 2024 జనవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వె ల్లడించారు. ప్రతిభా కళాశాలలో ఐఐటీ, జేఈఈ, నీట్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


కాలిపోయిన రేకుల ఇల్లు

శంకర్‌పల్లి: విద్యుదాఘాతంతో ఓ రేకుల ఇల్లు దగ్ధమయింది. ఈ సంఘటన శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి గణేశ్‌నగర్ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డె అనసూయ కూరగాయలు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తుంది. ఎప్పటిలాగే ఆమె ఇంటికి తాళం వేసి, వ్యాపారం నిమిత్తం మార్కెట్‌కు వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో షాక్‌సర్క్యూట్ అయి, మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రితో పాటు రూ.30వేల నగదు కాలి బూడిద అయిందని బాధితురాలు వాపోయింది.

దేశ భవిష్యత్తే ప్రధాని లక్ష్యం


ఖానాపూర్ సంకల్ప్ యాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి


కేసారంలో ఆభా నమోదు పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ డీఎం దామోదర్

- సంక్షేమ ఫలాలు అర్హులకు అందిచాలన్నదే ధ్యేయం
- 'సంకల్ప్' యాత్రలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: దేశ భవిష్యత్తు గురించి ఆలోచించే వ్యక్తి ప్రధాని మోదీ అని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండల పరిధి ఖానాపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం 'వికసిత్ భారత్ సంకల్ప్' యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చేందుకు ఈ యాత్ర కొనసాగుతుందని, ఇది నిజమైన అర్హులు లబ్ధి పొందేందుకు దోహద పడుతుందని చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలంటే మరోసారి మోదీయే ప్రధాని కావాలని, మన కోసం పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, శ్రీరామ్‌నగర్ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్ రెడ్డి, పలువురు అధికారులు, గ్రామస్తులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆభా పత్రాల పంపిణీ

ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తోందని డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ అన్నారు. వికసిత్ భారత సంకల్ప్ యాత్రలో భాగంగా కేసారంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన 30 మందికి ఆభా కార్డులను అందజేశారు. ఆయుష్మాన్ భారత్‌లో ప్రతి ఒక్కరూ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా పేదలకు ఉచిత ఆరోగ్యవైద్య సేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గోపాల్‌రెడ్డి, సంతోష్, సుదర్శన్, బలరాం, బాలకృష్ణ, శ్రీవాణి, ఆశ, ఏఎన్ఎం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి


ఎజాజ్ పాష మృతదేహం

కేశంపేట: కుమార్తెను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి బైర్కాన్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూర్ మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన ఎజాజ్‌పాష(35) కూతురుకు వైద్యం చేయించేందుకు బైక్‌పై కొత్తపేట గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైర్కాన్‌పల్లి గ్రామ శివారు తెట్టెకుంట తండా వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో ఎజాజ్ తలకు బలమైన గాయం కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమార్తెకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఎజాజ్ సోదరుడు షేక్ జాఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

కూడలిలో అగ్ని ప్రమాదం

మీర్‌పేట: ఖాళీ స్థలంలో ఉన్న చెత్తకు నిప్పంటుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. బాలాపూర్ కూడలి హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపాన ఉన్న కారు షెడ్డు పక్కన ఖాళీ స్థలంలోని ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. గమనించిన షెడ్డు నిర్వాహకులు మంటలను అదుపులోకి తెచ్చారు. బంకు పక్కనే ఉండడంతో స్థానికులు ఆందోళన చెందారు. ఈ సంఘటనలో ఎటువంటి నష్టం జరగలేదు.

గంజాయి పట్టివేత

శంకర్‌పల్లి: గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు డీఐ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సోదాల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన అప్పుఅలం (34), తబ్రేజ్(30), కుర్షీద్‌లు మండల పరిధి మోకిల గ్రామ శివారుల్లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం బీదర్ నుంచి గంజాయి తీసుకువచ్చి, దొంతానపల్లి గ్రామ శివారు కళాశాల విద్యార్థులకు, మున్సిపల్ పరిధి యువకులకు విక్రయిస్తుండగా.. పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నిందితుల నుంచి 560 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో ఎస్ఐ సంతోష్‌రెడ్డి, డీఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

జనరేటర్ల నుంచి డీజిల్ దొంగతనం

శంషాబాద్ రూరల్: సెల్ టవర్ జనరేటర్ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్‌ను దొంగిలించారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాల్మాకులలో జీయో నెట్‌వర్క్‌కు చెందిన సెల్ టవర్ ఉంది. దీని కోసం అమర్చిన జనరేటర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్‌ను దొంగిలించారు. ఈ నెల 9న ఆన్‌లైన్ చెకింగ్‌తో విషయాన్ని గమనించిన సూపర్‌వైజర్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల రోజుల నుంచి పెద్దషాపూర్‌తండా, రామంజాపూర్, గొల్లపల్లిలో ఉన్న జీయో సెల్ టవర్ జనరేటర్ల నుంచి డీజిల్ దొంగతనం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూకబ్జాకు యత్నించిన వారిపై కేసు

శంషాబాద్ రూరల్: వ్యవసాయం పొలం పక్కనే ఉన్న వెంచరులో ప్లాటు కొనుగోలు చేసిన వ్యక్తులు అక్రమంగా భూమిలోకి చొరబడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తొండుపల్లి గ్రామానికి చెందిన బైతి కృష్ణకు ఈ గ్రామంలోని సర్వే నంబరు 139/ఇ/ఆలో 21 గుంటల పొలం ఉంది. ఇందులో వరి సాగు చేయగా.. ఇటీవలే వరి కోత చేపట్టారు. ఈ పొలం పక్కన ఉన్న న్యూప్లానెట్ వెంచరులో ప్లాటు కొనుగోలు చేసిన తొండుపల్లి చెందిన రాచమల్ల రాజ్‌కుమార్, సౌజన్యం దంపతులు మరి కొంత మంది మంగళవారం జేసీబీతో వచ్చి పొలంలో చదును చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం వివరాలు లభ్యం

శంషాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ దొరికింది. ఈ నెల 14 రాత్రి మండలంలోని నర్కూడ శివారులో నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని బైక్ ఢీకొనగా.. ఉస్మానియాకు తరలించే సమయానికి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు. అయితే మృతుడు మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్ వాసి కుమ్మరి కృష్ణగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు మంగళవారం మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

ఆటోను తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

అత్తాపూర్: పార్కు చేసిన ఆటోను తగలబెట్టిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్‌మేట్ ప్రాంతంలో ఉన్న ఉర్దూ పాఠశాల సమీపంలో మూడు నెలలుగా మూడు ఆటోలను తగలబెట్టారు. స్థానికంగా ఉన్న పేదలు ఆటోలు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తుంటారు. మహ్మద్ ఖాజా పాష (33) అనే వ్యక్తి స్థానిక ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాల సమీపంలో తన ఆటో (టీఎస్ 09యుబీ9362)ను పార్కు చేయగా.. మధ్య రాత్రి ఒకటిన్నర గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు పుస్తెల వితరణ


మంజులకు బంగారు పుస్తెలను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్: నిరుపేద దళిత మహిళకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బంగారు పుస్తెలను మంగళవారం అందజేశారు. మున్సిపల్ పరిధి చటాన్‌పల్లికి చెందిన మంజుల గత నెల 27న పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన బహిరంగ సభకు ఆమె వెళ్లింది. ఈ సభలో మంజుల బంగారు పుస్తెల తాడు చోరీకి గురైంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు.. ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పార్టీ యువ నాయకులు ఆలోనిపల్లి రాజుగౌడ్ సహకారంతో ఎమ్మెల్యే శంకర్ మంజులకు రూ.50 వేలు విలువ చేసే పుస్తెలను అందజేశారు. దీంతో మంజుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజేందర్‌రెడ్డి, 3వ వార్డు కౌన్సిలర్ రాయికల్ శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.